క్లుప్తంగా

హైకోర్టు న్యాయవాదికి సత్కారం



న్యాయవాది చలపతిరావును సన్మానిస్తున్న పార్టీ శ్రేణులు

ఏలేశ్వరం: మండలంలోని లింగంపర్తి గ్రామంలో హైకోర్టు న్యాయవాది ఎం.చలపతిరావును బుధవారం ఘనంగా సన్మానించారు. సీపీఐ(ఎంఎల్) వినోద్‌మిశ్రా పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొశిరెడ్డి గణేష్ ఆధ్వర్యంలో న్యాయవాది చలపతికి శాలువా కప్పి, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ, న్యాయవాది చలపతిరావు పేద ప్రజల కోసం స్వచ్ఛందంగా న్యాయపోరాటం చేశారన్నారు. చలపతిరావు మాట్లాడుతూ, పార్టీ ఆర్గనైజింగ్ కార్యదర్శి కొశిరెడ్డి గణేష్ పేదప్రజల సమస్యలపై అనేక పోరాటాలు చేశారన్నారు. కార్యక్రమంలో గండేటి కిషోర్, రెడ్డి ఆనంద్‌పాల్, దాడిశెట్టి వీరబాబు, గండేటి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవుని సన్నిధిలో ఇన్‌కం టాక్స్ చీఫ్ కమిషనర్



శ్రీనివాస్ దంపతులకు స్వాగతం పలుకుతున్న ఈఓ

అన్నవరం: సీనియర్ ఐఆర్ఎస్ అధికారి, చీఫ్ కమిషనర్ ఆఫ్ ఇన్‌కం టాక్స్ (విశాఖపట్నం) డి.శ్రీనివాస్ దంపతులు బుధవారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించుకుని, పూజలు చేశారు. ఆలయం వద్ద వారికి పండితులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేద పండితులు ఆశీస్సులు అందజేశారు. స్వామివారి ప్రసాదాన్ని దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు వారికి అందజేశారు.

సెక్యూరిటీ గార్డ్స్ జీతాలు చెల్లించాలి

తొండంగి: రావికంపాడులో శివరాం యార్న్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సెక్యూరిటీ గార్డ్స్ పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలని ఎఫ్ఎస్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శివకోటి రాజు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కంపెనీలో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్న కార్మికులకు కొద్ది నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని చెప్పారు. జీతాలు చెల్లించకపోవడంతో వారి కుటుంబ పోషణకు సెక్యూరిటీ గార్డులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. యాజమాన్యం తక్షణమే పెండింగ్ జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఘనంగా దేవల మహర్షి జయంతి



దేవల మహర్షికి పూజలు చేస్తున్న భక్తులు

తుని: పట్టణంలోని పల్లపువీధిలో ఉన్న గౌరీశంకర్ సమేత వీరభద్రస్వామి ఆలయంలో దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం దేవాంగ కుల మూల పురుషుడు దేవల మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దొంతంశెట్టి మల్లికార్జునరావు దేవల మహర్షి చిత్రపటానికి పూజలు చేశారు. దేవల మహర్షి చరిత్రను సంఘ ఉపాధ్యక్షుడు కుందెం సత్యనారాయణ వివరించారు.

మాజీ మంత్రి తోట పరామర్శ

గండేపల్లి: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం బుధవారం పలు కుటుంబాలను పరామర్శించారు. మండలంలోని బొర్రంపాలేనికి చెందిన సాగి నల్లబాబు, బాలు, తాళ్లూరులో ఇంజరపు శివప్రసాదరావు మృతి చెందడంతో, వారి కుటుంబాలను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ఈయన వెంట ఎంపీపీ చలగళ్ల దొరబాబు, పార్టీ మండల అధ్యక్షులు మద్దిపట్ల రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు రామకుర్తి మూర్తి, జగ్గంపేట మండల అధ్యక్షుడు రావుల గణేష్‌రాజా, నేతలు ఒబిణ్ణి సత్యనారాయణ, వీరబాబు, మాజీ సర్పంచ్ విష్ణు తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో బాధిత కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు పరామర్శించారు. గ్రామానికి చెందిన పెండ్యాల లోవరాజు కుమారుడు ఆనంద్‌కుమార్ ఇటీవల మృతి చెందారు. అతడి కుటుంబాన్ని మురళీకృష్ణంరాజు పరామర్శించి, ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు పెండ్యాల అబ్బు, పళ్లా లచ్చబాబు, పళ్లా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కన్నీటి ధార

- అక్కరకు రాని సాగునీటి ప్రాజెక్టులు
- జడేరు మడేరు జలాలు మళ్లిస్తే ఆయకట్టుకు ప్రయోజనం
- ఏలేరు జలాలను సేద్యానికి వినియోగించాలంటున్న రైతులు
- శాపంలా మారుతున్న పాలకుల నిర్లక్ష్యం



అభివృద్ధికి నోచుకోని సుబ్బారెడ్డి సాగర్ ప్రాజెక్టు

ప్రత్తిపాడు రూరల్: పుష్కలంగా సాగునీటి వనరులున్నా సాగుకు అక్కరకు రాని పరిస్థితి నెలకొంది. ఇ.గోకవరంలో సుబ్బారెడ్డి సాగర్ పది వేల ఎకరాలకు సాగునీరు అందించే మధ్య తరహా సాగునీటి జలాశయం పూర్తి స్థాయిలో ఆధునీకరణకు నోచుకోకపోవడం, కిత్తమూరిపేట వద్ద కట్టుచింతల ప్రాజెక్టు ఐదు వేల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంగా 21 ఏళ్ల కిందట నిర్మించినా, చిన్నతరహా సాగునీటి జలాశయం నేటికీ కాలువలకు నోచుకోలేదు. ఏలేశ్వరంలోని ఏలేరు రిజర్వాయర్ ఎడమ కాలువ నుండి విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌కు ఏలేశ్వరం, ప్రత్తిపాడు, శంఖవరం, రౌతులపూడి మండలాల మీదుగా నీటి సరఫరా జరుగుతున్నా, సేద్యానికి పూర్తి స్థాయిలో వినియోగించుకోలేని పరిస్థితి స్థానిక రైతులది. దీంతో సాగునీటి కోసం రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.

జడేరు మడేరు జలాలను మళ్లించాలి

సుబ్బారెడ్డి సాగర్ ప్రాజెక్టుకు జడేరు మడేరు జలాలను మళ్లిస్తే ఆయకట్టు పరిధిలో రెండు పంటలు పండే అవకాశం ఉంటుంది. ఏలేరు ప్రాజెక్టుకు వెళ్లే జడేరు మడేరు జలాలను జడ్డంగి వద్ద ఉన్న చెక్ డ్యాం నుంచి ఎనిమిది కి.మీ. కాలువ తవ్వితే గొంతీదేవివాగు మీదుగా సుబ్బారెడ్డి సాగర్‌కు జలాలు చేరుతాయి. ఇదే జరిగితే సాగర్ ఆయకట్టుకు పుష్కలంగా రెండు పంటలు పండే అవకాశం ఉంటుంది. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

సేద్యానికి వినియోగించాలి

ఏలేరు రిజర్వాయర్ ఎడమ కాలువ నుండి విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌కు మండలం మీదుగా వెళ్లే జలాలను సేద్యానికి వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ఎన్నో ఏళ్లుగా రైతులు కోరుతున్నారు. ఇప్పటికే ఈ కాలువను ఆనుకుని ఉన్న అతి తక్కువ మంది రైతులు ఊట నీరుతో రెండు పంటలు పండిస్తున్నారు. అదే పూర్తి స్థాయిలో వినియోగంలోకి తెస్తే ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని ఇక్కడి రైతులు చెబుతున్నారు.

రైతుల పాలిట శాపం

పాలకుల నిర్లక్ష్యం కారణంగా మండలంలో పుష్కలంగా సాగునీటి వనరులున్నా పూర్తి స్థాయిలో వినియోగంలోకి రాని పరిస్థితి నెలకొంది. ఇదే ఇప్పుడు రైతుల పాలిట శాపంగా మారింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో బంగారయ్యపేట వద్ద స్లూయిజ్ ద్వారా పంపాకు నీరు మళ్లించారు. దీంతో స్థానిక రైతులకు ఎంతో మేలు చేకూరింది. ఇదే తరహాలో శాశ్వతంగా సాగు నీటిని అందించాలని రైతులు కోరుతున్నారు.



ఏలేరు ఎడమ కాలువ నుంచి స్టీల్‌ప్లాంట్‌కు తరలిపోతున్న జలాలు



శిథిలావస్థకు చేరిన సుబ్బారెడ్డి సాగర్ కాలువ

చివరి ఎకరానికి నీరందాలి



మండలంలో సాగునీటి వనరులు పుష్కలంగా ఉన్నా వాటి వినియోగం అంతంతమాత్రంగా ఉంది. దీంతో ఆయకట్టు రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ప్రతి ఆయకట్టు చివర ఎకరానికి సాగునీరు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– మంతిన రాజేశ్వరరావు, రైతు, పెద్దిపాలెం

సాగర్‌కు మళ్లించాలి



జడేరు మడేరు జలాలను సుబ్బారెడ్డి సాగర్‌కు మళ్లించాలి. అప్పుడే ఆయకట్టు చివరి ఎకరానికి సాగునీరు అందడమే కాకుండా, రైతులకు రెండు పంటలు పుష్కలంగా పండుతాయి. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకుంటే ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుంది.

– మాకా చంటిబాబు, రైతు, పెద్దిపాలెం

వినియోగంలోకి తేవాలి



ఏలేరు రిజర్వాయర్ ఎడమ కాలువ నుండి విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌కు మండలం మీదుగా వెళ్లే జలాలను రైతుల వినియోగంలోకి తీసుకురావాలి. తద్వారా రైతుల సాగునీటి కష్టాలు పూర్తి స్థాయిలో తీరుతాయి. ఇదే జరిగితే రైతుల పాలిట వరంగా మారుతుంది.

– బుర్రె రామకృష్ణ, రైతు, శరభవరం

ఆధునీకరణకు చర్యలు



సుబ్బారెడ్డి సాగర్ ప్రాజెక్టును పూర్తి స్థాయిలో ఆధునీకరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఈ మేరకు ప్రభుత్వానికి ఇప్పటికే ప్రతిపాదనలు పంపాం. ప్రాజెక్టు దిగువన కోతకు గురైన పాపయ్య డ్యాం మరమ్మతులు, కాలువ పూడికతీత పనులు ఇప్పటికే దశలవారీగా జరుగుతున్నాయి.

– ఇళ్ల అప్పారావు, చైర్మన్, సుబ్బారెడ్డి సాగర్ ప్రాజెక్టు సాగునీటి సంఘం

కూటమి ప్రభుత్వానికి చరమ గీతం



ఏలేశ్వరంలో రామన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గిరిబాబు తదితరులు

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు

ఏలేశ్వరం: ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కూటమి ప్రభుత్వానికి చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. పట్టణంలో బుధవారం ఆయన పర్యటించారు. పార్టీ శ్రేణులతో కలిసి పార్టీ సానుభూతిపరులు, అభిమానులను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ అరాచక పాలన సాగుతోందన్నారు. వైఎస్సార్ సీపీ శ్రేణులే లక్ష్యంగా కుతంత్ర పాలన చేస్తోందన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధించడం ఖాయమన్నారు. నీటి సంఘం మాజీ చైర్మన్ సామంతుల రామన్న ఇటీవల మృతి చెందగా, ఆయన కుటుంబ సభ్యులను కలిసి గిరిబాబు సానుభూతి వ్యక్తం చేశారు. కుమారుడి మృతితో బాధపడుతున్న పీఏసీఎస్ సీఈఓ జ్యోతుల శ్రీనును కూడా పరామర్శించారు. వీరితో పాటు పలువురిని ఓదార్చారు. కార్యక్రమంలో పార్టీ నేతలు సామంతుల సూర్యకుమార్, సుంకర రాంబాబు, బదిరెడ్డి గోవిందు, శిడగం వెంకటేశ్వరరావు, కోరాడ ప్రసాద్, పైల విజయ్‌కుమార్, జువ్విన వీర్రాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం జె.అన్నవరంలో పర్యటించారు.

పత్రికా స్వేచ్ఛను కాపాడాలి



రౌతులపూడిలో ఎస్సై వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందిస్తున్న పాత్రికేయులు

రౌతులపూడి: సాక్షి పత్రికా కార్యాలయాలపై, కొమ్మినేని శ్రీనివాసరావు వంటి సీనియర్ పాత్రికేయులపైన టీడీపీ నాయకులు దాడి చేయడం పత్రికా స్వేచ్ఛను హరించడమేనని మండల విలేకరులు ఆరోపించారు. పత్రికా స్వేచ్ఛను కాపాడాలంటూ రౌతులపూడి ఎస్సై జి.వెంకటేశ్వరరావుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. సాక్షి పత్రికలో తమపై వ్యతిరేకంగా వార్తలు ప్రచురితమయ్యాయనే అక్కసుతో రాష్ట్రవ్యాప్తంగా సాక్షి కార్యాలయాలపై కూటమి నేతలు దాడులు చేసి, ఫర్నిచర్, ఎలక్ట్రానిక్ వస్తువులను ధ్వంసం చేయటం దారుణమని వారు వాపోయారు. అలాగే రాష్ట్రంలో జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు అరికట్టాలని ఈ సందర్భంగా వారు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు దార్లపూడి శ్రీనివాసరావు, లవుడు వెంకటరమణ, యామల జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

తొండంగి: గోపాలపట్నం సబ్‌స్టేషన్ పరిధిలో పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ జగ్గంపేట ఈఈ వీరభద్రరావు తెలిపారు. హంసవరం నుంచి అన్నవరం వచ్చే 33 కేవీ లైన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ అన్నవరం, గోపాలపట్నం, ఏ.కొత్తపల్లి, బెండపూడి, మండపం, గౌరంపేట, సుబ్బరాయపురం, రావికంపాడు, పి.చిన్నాయపాలెం, తమ్మయ్యపేట గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

తుని: లైన్ల నిర్వహణలో భాగంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ వీరభద్రరావు బుధవారం తెలిపారు. పట్టణ పరిధిలోని తాండవ సబ్‌స్టేషన్ నిర్వహణ, 11 కేవీ సీతారాంపురం, కత్రాళ్ల కొండ ఫీడర్ల లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఒకటి నుంచి పది వార్డుల్లో విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందన్నారు. డీమార్ట్, కొండవారిపేట, టైలర్స్‌కాలనీ, కంకిపాటివారి గరువు, అమ్మాజీపేట, సీతారాంపురం, టీటీ బంగ్లా రోడ్డు, డ్రైవర్స్‌కాలనీ, రెల్లికాలనీ, నెహ్రూనగర్, శ్రీనివాసా సెంటర్, కొట్టాం బస్‌సెంటర్, ఆర్టీసీ కాంప్లెక్సు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వివరించారు.

నేటి నుంచి స్కూళ్లు ప్రారంభం

ప్రత్తిపాడు: వేసవి సెలవులు ముగియడంతో గురువారం నుంచి పాఠశాలలు పనిచేస్తాయని ఎంఈఓ వి.రాజబాబు తెలిపారు. మండలంలోని 36 మండల పరిషత్ ప్రాథమిక, ఐదు ప్రాథమికోన్నత, తొమ్మిది ఉన్నత పాఠశాలలు, పది గిరిజన ప్రాథమిక పాఠశాలలతో పాటు, 24 ప్రైవేటు పాఠశాలలు తెరుచుకోనున్నాయి. ఈ నేపథ్యంలో స్థానిక ప్రభుత్వ ఎస్సీ బాలుర, ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహాల్లో రాచపల్లి పీహెచ్‌సీ సిబ్బంది దోమల నివారణ మందును స్ప్రే చేశారు.

పలు అభివృద్ధి పనులు ప్రారంభం



లింగంపర్తిలో గోకులం షెడ్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

శంఖవరం: మండలంలోని కత్తిపూడి, శంఖవరం, వజ్రకూటంలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, ఎంపీ తంగెళ్ల శ్రీనువాస్ పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. వజ్రకూటంలో రహదారికి శంకుస్థాపన చేసిన అనంతరం, కత్తిపూడి, శంఖవరాల్లో రూ.59 లక్షల వంతున వ్యయంతో నిర్మించిన బాలుర వసతి గృహాల భవనాలను ప్రారంభించారు.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులో రూ.10 లక్షలతో నిర్మించే రోడ్ల పనులను ఎమ్మెల్యే సత్యప్రభ ప్రారంభించారు. ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సభ్యుడు కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం: లింగంపర్తి నుంచి కొండతిమ్మాపురం రోడ్డుకు ఎమ్మెల్యే సత్యప్రభ శంకుస్థాపన చేశారు. గోకులం షెడ్‌ను ప్రారంభించారు. ఎంపీడీఓ సూర్యనారాయణ, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు జ్యోతుల పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

రౌతులపూడి: బంగారయ్యపేటలో గోశాల, రౌతులపూడిలో సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. మండలంలో రూ.92 లక్షలతో నిర్మించనున్న బీబీపట్నం–లచ్చిరెడ్డిపాలెం రోడ్డు, రూ.2.6 కోట్లతో నిర్మించే లచ్చిరెడ్డిపాలెం–ఎస్ఎస్ పట్నం రోడ్డుకు భూమిపూజ చేశారు. లచ్చిరెడ్డిపాలెంలో మంచినీటి ట్యాంకును ప్రారంభించారు.

ప్రత్తిపాడు రూరల్: ధర్మవరంలో రూ.31 లక్షలతో నిర్మించిన మూడు అంగన్వాడీ భవనాలను కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ కొమ్ముల కన్నబాబు పాల్గొన్నారు.

బీసీవై పార్టీకి అనూష యాదవ్ రాజీనామా



డాక్టర్ అనూష యాదవ్

ప్రత్తిపాడు రూరల్: భారత చైతన్య యువజన (బీసీవై) పార్టీ రాష్ట్ర సమన్వయ సారథి, బీసీ నాయకురాలు డాక్టర్ దేవర అనూష యాదవ్ బుధవారం ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఆమె గత లోక్‌సభ ఎన్నికల్లో బీసీవై పార్టీ తరుపున కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేశారు. బుధవారం ఆమె పార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్‌కు రాజీనామా లేఖను పంపించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయాల్లో తృతీయ ప్రత్యామ్నాయంగా, బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారమే లక్ష్యంగా ఆవిర్భవించిన బీసీవై పార్టీలో తాను రాష్ట్ర సమన్వయ సారధిగా బాధ్యతలు నిర్వహించినట్లు తెలిపారు. ఎన్నికల అనంతరం ఉన్నత చదువుల్లో భాగంగా రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరించలేకపోతున్నందున పార్టీకి రాజీనామా చేసినట్లుగా వివరించారు.

14 నుంచి విద్యార్థులకు బస్సు పాసులు

గోకవరం: ఆర్టీసీ గోకవరం డిపో పరిధిలో విద్యార్థులకు ఈ నెల 14 నుంచి స్టూడెంట్ బస్సు పాసులు మంజూరు చేస్తామని డిపో మేనేజర్ సుచరిత మార్గరేట్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్టూడెంట్, సీజన్ బస్సు పాసుల రంగులను మారుస్తున్నందున ఈ నెల 12, 13 తేదీల్లో పాసుల జారీ నిలుపుదల చేసినట్టు చెప్పారు. బస్సు పాసుల కోసం విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని, ప్రింట్ కాపీపై సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్‌తో సంతకం చేయించుకుని రావాలన్నారు. బస్సు పాస్ కౌంటర్‌లో కాపీ సమర్పించి పాసును పొందవచ్చన్నారు. ఇతర వివరాలకు గోకవరం ఆర్టీసీ డిపోలో సంప్రదించాలన్నారు.



సుచరిత మార్గరేట్, డిపో మేనేజర్

తుని: ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు ఈ నెల 14 నుంచి కొత్త బస్ పాస్‌లు జారీ చేస్తామని ఆర్టీసీ తుని డిపో మేనేజరు కిరణ్‌కుమార్ బుధవారం తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆర్టీసీ కాంప్లెక్సులోని కౌంటర్‌లో ఉదయం 8 గంటల నుంచి కొత్త బస్సు పాస్‌లు పొందవచ్చన్నారు. గురు, శుక్రవారాల్లో పాస్‌లు ఇవ్వబడవన్నారు. కొత్త బస్సు పాస్‌లు అవసరమైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఏపీపీకి ఘన సన్మానం



ఏపీపీ మణికంఠకుమార్‌ను సత్కరిస్తున్న న్యాయవాదులు

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ) మణికంఠకుమార్‌ను న్యాయవాదులు బుధవారం ఘనంగా సత్కరించారు. ఏపీపీ మణికంఠకుమార్ ప్రత్తిపాడు కోర్టు నుంచి కృష్ణా జిల్లా నందిగామ కోర్టుకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో బార్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు ఆధ్వర్యంలో సత్కార సభ జరిగింది. ఏపీపీ మణికంఠ కుమార్ సేవలను న్యాయవాదులు కొనియాడారు. అనంతరం ఏపీపీని న్యాయవాదులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బార్ ప్రతినిధులు పి నాగేంద్రరాజు, కామేష్, బెహరా లక్ష్మీప్రసన్న, సీనియర్ న్యాయవాదులు బుగత శివ, పిల్లి బలరాముడు, ఆర్ అత్యుత రామారావుతో పాటు, న్యాయవాదులు, న్యాయవాద గుమస్తాలు, కోర్టు సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

19న విద్యుత్ వినియోగదారుల సదస్సు

విశాఖ సిటీ: ఏపీఈపీడీసీఎల్ పరిధిలో విశాఖ జోన్–2, బొబ్బిలి, జగ్గంపేట డివిజన్ల విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం సదస్సులు నిర్వహించనున్నట్లు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) చైర్‌పర్సన్, విశ్రాంతి జడ్జి బి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19న కాకినాడ సర్కిల్ జగ్గంపేట డివిజన్(హంసవరం సెక్షన్) కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు ఈ సదస్సు జరుగుతుందని చెప్పారు. వినియోగదారులు నేరుగా పాల్గొని, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, హెచ్చు తగ్గులు, బిల్లుల సమస్యలు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, పేరుమార్పిడి, విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో జాప్యం, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి తదితర విద్యుత్ సంబంధిత సమస్యలపై ఫిర్యాదులను తెలపాలని సూచించారు. వీటిని పరిశీలించి, విచారణ జరిపి తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తుల ఆహ్వానం

జగ్గంపేట: ఫిజిక్స్ గెస్ట్ ఫ్యాకల్టీగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పని చేసేందుకు అర్హత కలిగిన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు తెలిపారు. ఎమ్మెస్సీ ఫిజిక్స్‌లో 50 శాతం మార్కులు సాధించిన వారిని గెస్ట్ ఫ్యాకల్టీగా నియమిస్తామని చెప్పారు. ఈ నెల 16వ తేదీలోగా దరఖాస్తులు అందజేయాలని, అదే రోజు ఇంటర్వ్యూ నిర్వహిస్తామని తెలిపారు.

35 శాతం భక్తుల్లో అసంతృప్తి..!

అన్నవరం: అన్నవరంలోని శ్రీవీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి విచ్చేస్తున్న భక్తులు సంతృప్తి చెందేలా సేవలందించడంలో దేవస్థానం వైఫల్యం చెందుతోంది. గత మే నెలలో సత్యదేవుని ఆలయానికి హాజరైన భక్తుల్లో మూడో వంతుకు పైగా దేవస్థానంలో ఏర్పాట్లపై అసంతృప్తి వ్యక్తం చేసినట్టు ప్రభుత్వ సర్వేలో తేలింది. ఏప్రిల్ 30 నుంచి మే 25 వరకు రాష్ట్రంలోని ఏడు ప్రముఖ దేవస్థానాల్లో ప్రభుత్వం సర్వే నిర్వహించింది. అందులో అన్నవరంలోని సత్యదేవుని ఆలయంలో 35 శాతం భక్తులు అసంతృప్తి వ్యక్తం చేసినట్టు వెల్లడైంది. దర్శనం విషయంలో 32 శాతం మంది, మౌలిక వసతుల కల్పనలో 39 శాతం, స్వామివారి గోధుమ నూక ప్రసాదం నాణ్యతపై 22 శాతం, పారిశుధ్య నిర్వహణలో 36 శాతం భక్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు. గత జనవరిలో నిర్వహించిన సర్వేలో చివరిన ఏడో ర్యాంకు రాగా, ఫిబ్రవరిలో రెండో ర్యాంకు వచ్చింది. తాజాగా మే నెలలో నిర్వహించిన సర్వేలో కూడా భక్తుల్లో అసంతృప్తి తగ్గలేదని స్పష్టమైంది. దీనిపై దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు బుధవారం దేవస్థానం అధికారులతో సమావేశం నిర్వహించారు.

సత్యదేవుని దర్శించిన 40 వేల మంది

రత్నగిరి సత్యదేవుని ఆలయం బుధవారం భారీ సంఖ్యలో విచ్చేసిన భక్తులతో పోటెత్తింది. సుమారు 40 వేలమంది భక్తులు సత్యదేవుని ఆలయానికి తరలివచ్చారు. సత్యదేవుని దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట సమయం పట్టింది. స్వామివారి వ్రతాలు రెండువేలు నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షలు ఆదాయం సమకూరింది. సుమారు ఐదువేల మంది భక్తులకు సత్యదేవుని నిత్యాన్నదానపథకంలో ఉచిత భోజన సౌకర్యం కలుగ చేశారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు



జెడ్ రాగంపేటలో సీహెచ్‌సీని ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

గండేపల్లి: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలోని జెడ్ రాగంపేటలో రూ.6.50 కోట్లతో నిర్మించిన సీహెచ్‌సీ ప్రారంభోత్సవంలో వారు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ 30 పడకల ఆస్పత్రిలో పోస్టుమార్టం భవనాన్ని త్వరలో నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వైద్యులు ఎస్ స్వప్న, ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం గండేపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, రూ.5.50 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశామన్నారు. వైస్ ఎంపీపీ కుంచె రాజా, పుష్కర కమిటీ చైర్మన్ అడబాల భాస్కరరావు, సర్పంచ్ కందుల చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

కిర్లంపూడి: మండలంలోని రూ.8.40 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ శంకుస్థాపన చేశారు. స్థానిక సత్యదేవా కల్యాణ మండపం వద్ద పైలాన్‌ను ఆవిష్కరించారు. ఎంపీడీఓ తోట రవి, సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత, జెడ్పీటీసీ సభ్యుడు తోట గాంధీ, ఏలేరు ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ బస్వా వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

గోకవరం: మండలంలో ఉపాధి హామీ నిధులు రూ.13.52 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నెహ్రూ శంకుస్థాపన చేశారు. 63 సీసీ రోడ్లు, ఐదు బీటీ రోడ్ల నిర్మించేందుకు స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద శంకుస్థాపన స్థూపం ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ గోవిందు, జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్‌బాబు, సూరంపాలెం నీటి సంఘం చైర్మన్ ఉంగరాల రాము తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట: నియోజకవర్గంలో చేపట్టే అభివృద్ధి పనుల శంకుస్థాపన స్థూపాన్ని ఎంపీ తంగెళ్ల శ్రీనివాస్, ఎమ్మెల్యే నెహ్రూ ఆవిష్కరించారు. స్థానిక ట్రావెల్స్ బంగ్లా వద్ద జరిగిన కార్యక్రమంలో నెహ్రూ మాట్లాడుతూ, నాలుగు మండలాల్లో రూ.21.35 కోట్లతో అభివృద్ధి పనులు చేపడతామన్నారు.

చిన్నారుల తల్లులకు అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న తల్లులు, పిల్లలు

జగ్గంపేట: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ పిలుస్తోంది అనే కార్యక్రమాన్ని స్థానిక నెహ్రూ కాలనీలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ పూర్ణిమ మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాల్లో మూడేళ్లు నిండిన పిల్లలను చేర్పించడంపై తల్లులకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు ఆటపాటలు, సృజనాత్మకత, చదువు నేర్పిస్తామని చెప్పారు. ఐదేళ్లు వచ్చాక పిల్లలు స్కూళ్లకు వెళ్లేందుకు సంసిద్ధులవుతారని తెలిపారు. చిన్నారులను అంగన్‌వాడీలో చేర్పిస్తామని తల్లులతో ప్రతిజ్ఞ చేయించారు. పిల్లలతో అక్షరాభ్యాసం చేయించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు పాల్గొన్నారు.